క్లుప్తంగా

శివాలయ ప్రతిష్టను కాపాడాలి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): నగరి మండలంలో టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బుగ్గ గుడి శివాలయ ప్రతిష్టను కాపాడాలని ఆ గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు రఘునాథచారి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. బుగ్గ గుడి అర్చకుడు కుప్పయ్య, అటెండర్ హరి వ్యవహార తీరు కారణంగా ఆలయ ప్రతిష్ట నానాటికి మసకబారుతోందన్నారు. అర్చకుడికి కాలు విరిగి నాలుగు నెలల పాటు విధుల్లో లేరని, మెడికల్ లీవ్ లేకుండా రిజిస్టర్‌ను ఇంటి వద్దకే తెప్పించుకుని సంతకాలు పెట్టి జీతం పొందారని ఆరోపించారు. ఓ భక్తుడి వద్ద రూ.50 వేలు తీసుకొని ఆలయ పనులకు ఉపయోగించినట్లు లెక్కలు చూపించి తన ఖాతాలో వేసుకున్నారని ఆరోపించారు. అభిషేకం చేస్తానని చెప్పి తన వద్ద రూ.2500 వసూలు చేసి ఇంత వరకు అభిషేకం చేయలేదన్నారు. అర్చకుడు కుప్పయ్య, అటెండర్ హరి అనధికారికంగా భక్తుల వద్ద నగదు వసూలు చేస్తున్నారని, దీనిపై టీటీడీ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా టీటీడీ చైర్మన్ స్పందించి బుగ్గ గుడి ప్రతిష్టను కాపాడాలని కోరారు.

ఆరోగ్యం ఒక వరం



వైద్య సేవలందిస్తున్న డాక్టర్ మోహన్‌వేలు

తవణంపల్లె: ఆరోగ్యంగా ఉండడం ఒక వరమని డాక్టర్ మోహన్‌వేలు తెలిపారు. మండలంలోని నల్లపురెడ్డిపల్లెలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ మోహన్‌వేలు 35 మంది రోగులకు పరీక్షలు చేయించారు. గర్భిణులు ప్రభుత్వ ఆస్పత్రిలోనే కాన్పు చేసుకోవాలన్నారు. దీని ద్వారా తల్లీబిడ్డ క్షేమంగా ఉంటారని వివరించారు. హైరిస్క్‌తో బాధపడుతున్న గర్భిణులు డాక్టర్ పర్యవేక్షణలో ఉండడం మంచిదని చెప్పారు. అనంతరం గర్భవతులకు, బాలింతలు, బీపీ, సుగర్‌వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేయించి సూచనలు, సలహాలిచ్చారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుబ్రమణ్యం రెడ్డి, ఏఎన్‌ఎం, ఎంఎల్‌హెచ్‌పీ పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పర్యవేక్షణ

యాదమరి: మండలంలోని పలు పంచాయతీల్లో జరుగుతున్న పారిశుధ్య పనులను స్థానిక ఎంపీడీవో వేణు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన బుధవారం ఈఓపీఆర్డీ సుకుమార్ రెడ్డితో కలిసి యాదమరి, కోణాపల్లె, కాశిరాళ్ల పంచాయతీల్లో పర్యటించారు. పారిశుధ్య పనులను స్వయంగా పర్యవేక్షించారు. రోడ్డు పక్కన ఉన్న పేడ దిబ్బలను, అపరిశుభ్రంగా ఉన్న చెత్తను తీసివేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో అపరిశుభ్రతకు చోటివ్వక ఎప్పటికప్పుడు పరిసరాలను శుభ్రంగా ఉంచాలని పంచాయతీలోని పారిశుధ్య కార్మికులకు ఆదేశించామని చెప్పారు. స్వచ్ఛతలో మండలం అగ్రస్థానంలో నిలవాలని సిబ్బందికి సూచించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నెల 25వ తేదీ వరకు ప్రతి పంచాయతీలో పర్యటిస్తామని, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని కార్మికులను హెచ్చరించారు.

పౌష్టికమే తల్లులకు బలం



గర్భిణులకు సీమంతం చేస్తున్న అధికారులు, అంగన్‌వాడీ కార్యకర్తలు

చిత్తూరు రూరల్(కాణిపాకం): పౌష్టికాహారమే తల్లులు, పిల్లలకు బలమని సీడీపీఓ శ్యామ్‌సు గుణకుమారి పేర్కొన్నారు. చిత్తూరు మండలం తుమ్మింద గ్రామంలో బుధవారం పౌష్టికాహార పక్షోత్సవంపై అవగాహన కల్పించారు. పౌష్టికాహారం ఆకుకూరలు, కూరగాయలు, పప్పుదినుసులు, పండ్లపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని తల్లులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గర్భిణులకు పౌష్టికాహారం ద్వారా కలిగే లాభాలను అంగన్‌వాడీ కార్యకర్తలు తెలియజేయాలని సూచించారు. అనంతరం గర్భిణులకు సామూహిక సీమాంతం చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కవిత తదితరులు పాల్గొన్నారు.

నలిశెట్టిపల్లెలో నీటి నిల్వ కుంటల తవ్వకాలను చేపడుతున్న ఉపాధి కూలీలు



సప్లయ్ ఛానల్ పనులు చేస్తున్న కూలీల హాజరును పరిశీలిస్తున్న ఏపీఓ బాల



కూలీల వేతన వెతలు

- ముందుకు సాగని ఉపాధి పనులు
- నాలుగు నెలలుగా పస్తుల్లో కూలీలు
- పట్టించుకోని పాలకులు

తవణంపల్లె: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఉపాధి కూలీలకు సకాలంలో వేతనాలు అందడంలేదు. రెక్కాడితే డొక్కాడని కూలీలకు నెలల తరబడి వేతనాలు రాకపోవడంతో కటుంబ పోషణ భారంగా మారింది. వారం వారం వేతనాలు వస్తాయని ఆశించి పనులు చేసిన కూలీలు నిరాశతో ఎదురుచూస్తున్నారు. నాలుగు నెలలుగా వేతనాలు రాకపోవడంతో కూలీలు ఆకలితో అలమటిస్తున్నారు. గ్రామీణ ప్రజల జీవనోపాధి కోసం కేంద్ర, రాష్ట్ర కూటమి ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనులు చేపడుతున్నారు. కానీ వేతనాలు రాకపోయినా అధికారులు పనులు చేయాలని ఒత్తిడి చేస్తున్నారు. ఉపాధి పనులకు కూలీలు ముందుకు రాకపోవడంతో ఉపాధి పనుల లక్ష్యాన్ని అధిగమించడానికి సిబ్బందికి తలనొప్పిగా మారింది. మండలంలో 32 పంచాయతీల్లో 4922 జాబ్‌కార్డులు ఉన్నాయి ప్రస్తుతం 1280 జాబ్ కార్డుదారులు పనులు చేస్తున్నారు.

రూ.1.75 కోట్ల బకాయిలు

మండలంలో ఉపాధి హామీ పథకం పనులు చేసిన కూలీలకు జనవరి నుంచి వేతనాలు అందడం లేదు. జనవరిలో 510 మంది కూలీలు 39 పనులు చేపట్టారు. కూలీలకు రూ.8 లక్షలకు పైగా వేతనాలు చెల్లించాల్సి ఉంది. ఫిబ్రవరిలో 925 మంది కూలీలు 150 పనులు చేపట్టగా రూ.21 లక్షల మేరకు వేతనాలు బిల్లులు అందాల్సి ఉంది. మార్చిలో 900 మంది కూలీలు 78 పనులు చేపట్టారు. కూలీలకు రూ.20 లక్షల వేతన బిల్లులు అందలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పశువుల షెడ్లు, మామిడి మొక్కల పోషణ, సిమెంటు రోడ్లు, ఇంకుడు గుంతల తవ్వకాల నిమిత్తం మెటీరియల్ బిల్లులు సుమారు రూ.1.75 కోట్లకు పైగా చెల్లించాల్సి ఉంది. పశువుల షెడ్లు కట్టిన రైతులకు బిల్లులు అందలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఉపాధి సిబ్బందికి జీతాలు కరువు

ఉపాధి హామీ పథకం కింద విధులు నిర్వర్తిస్తున్న సిబ్బందికి కూడా జీతాలు నాలుగు నెలలుగా అందలేదు. మండలంలో ఏపీఓ ఒకరు, ఈసీ ఒకరు, టెక్నికల్ అసిస్టెంట్లు ఇద్దరు, కంప్యూటర్ ఆపరేటర్లు ఇద్దరు, ఫీల్డు అసిస్టెంట్లు 16 మంది విధులు నిర్వర్తిస్తున్నారు. వీరికి కూడా జీతాలు చెల్లించలేదు. జీతాల కోసం ఎదురుచూస్తున్నారు.

బిల్లులు అప్‌లోడ్ చేశాం



మండలంలో ఉపాధి కూలీలు చేసిన పనులకు బిల్లుల కోసం అప్‌లోడ్ చేశాం. ప్రభుత్వం ఉపాధి నిధులు విడుదలైన వెంటనే కూలీల వేతనాలు చెల్లిస్తాం. కూలీలకు రోజు వారి వేతనం రూ.307 చెల్లిస్తున్నాం. ఉపాధి పథకం కింద రైతులకు పండ్లు మొక్కలు సరఫరా చేస్తాం. అర ఎకరా ఉన్న వారికి కూడా పశుగ్రాసంతో పండ్ల మొక్కలు సరఫరా చేస్తాం. –బాల, ఏపీఓ ,తవణంపల్లె

బిల్లులు రాక అవస్థలు



ఉపాధి హామీ పథకం కింద నాలుగు నెలలుగా బిల్లులు రాక అవస్థలు పడుతున్నాం. ఈ పనులపైనే ఆధారపడ్డాం. కానీ బిల్లులు చెల్లింపులో ప్రభుత్వం చాలా ఆలస్యం చేయడం మాకు భారంగా మారింది. పనులు కూడా రోజూ ఉండడం లేదు. చేసిన పనులకు వేతనాలు ఇవ్వడం లేదు. దీనిపై అధికారులను అడిగినా ఎవరూ పట్టించుకోవడం లేదు. –హేమాద్రి, దిగువమోదలపల్లె

రూ.15 వేలు బిల్లులు రావాలి



ఫిబ్రవరి నుంచి ఉపాధి పనులకు వెళ్లాను. బిల్లుల కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నాం. అధికారులు చొరవ చూపడం లేదు. మేము ఈ ఉపాధి వేతనాలపైనే ఆధారపడ్డాం. కానీ ఆ వేతనాలు ఎప్పుడు ఇస్తారో తెలియడం లేదు. అప్పటివరకు కుటుంబం ఎలా గడుస్తుందో తెలియడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బిల్లులు మంజూరు చేయాలి. –బాబు, దిగువమోదలపల్లె

నగర వైఎస్సార్‌సీపీలో నియామకాలు

చిత్తూరు కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ అధిష్టానం ఆదేశాల మేరకు చిత్తూరు నగర పార్టీ కమిటీని నియమిస్తూ బుధవారం కేంద్ర పార్టీ కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. వైఎస్సార్‌సీపీ నగర కమిటీ ఉపాధ్యక్షులుగా నౌషాద్, దినేష్, ప్రధాన కార్యదర్శులుగా వెంకటేష్, నవాజ్, దేవరాజు, రాజశేఖర్, శివలింగం, కార్యదర్శులుగా అరుణ్, లోకనాథన్, కిషోర్, సుదర్శన్, శివకుమార్, ధనరాజ్, మారన్, అక్రం, ఖాదర్‌బాషా, రాజేష్‌బాబురెడ్డి, ఈసీ మెంబర్లుగా సత్య, వడివేలు(ఎంకేఎస్ కుట్టి), శివకుమార్, మనోహర్‌రెడ్డి, హరిణిరెడ్డి, మురళి, మురళీ జీఎస్ఎల్, జీన్‌టిమ్‌స్టీఫెన్, జగన్, మునేంద్రబాబు, షేక్‌సయ్యద్, ప్రేమ్‌కుమార్, విజయపరమేశ్వరరెడ్డి, గుణశేఖర్, హేమేంద్రరెడ్డి, పిచండి, ద్వారకనాథ్, చంద్రశేఖర్, కోదండన్, పాల్‌రాజ్ డేవిడ్, మురళీ, అన్బుస్వామి, అన్బు, దేవరాజుల మేస్త్రీ, చల్లాముత్తు, సెల్వం, మదన్‌కుమార్, పూంగొడి, ఖాదర్‌బాషా, ఇమ్రాన్, కృష్ణమూర్తి, షేక్‌మహమ్మద్ రఫీ, షుకూర్(ఆను), పుష్పలత, విజయ్‌కుమార్, సంపత్‌కుమార్, ఉన్నికృష్ణన్, డేవిడ్‌సన్, శరవణ, రమేష్, భువనేశ్వర్, వెంకటేష్, శివరెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, దినేష్‌కుమార్, నారాయణమూర్తి, రవిచంద్రారెడ్డి, జయగణేష్ నియమితులయ్యారు.

సకాలంలో వైద్య సేవలు



పేయనపల్లెలో సేవలు అందిస్తున్న వైద్యులు

గుడిపాల: ప్రతి గ్రామంలో సకాలంలో వైద్యసేవలు అందిస్తున్నామని డాక్టర్ పూజిత అన్నారు. పేయనపల్లె గ్రామంలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులు, షుగర్ పేషెంట్‌లకు వైద్య చికిత్సలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. 66 మందికి చికిత్సలు నిర్వహించారు. వైద్య సిబ్బంది రెజ్వాన, అన్నపూర్ణ, శివగామి, సుధ, శశి పాల్గొన్నారు.

సీతారాముల రథోత్సవ వైభవం



విశేషాలంకారంలో సీతారాములు



భక్తజనుల మధ్య కదులుతున్న రథం ముందు కోలాట కళాకారుల ప్రదర్శన

బంగారుపాళెం: మండలంలోని పాలేరులో మంగళవారం రాత్రి సీతారాముల రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. శ్రీరామనవమి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గ్రామంలోని శ్రీ కోదండరామస్వామి ఆలయంలో ఈ నెల 6 నుంచి 15వ తేదీ వరకు హరికథా కాలక్షేపాన్ని నిర్వహించారు. ఉత్సవాల చివరి రోజు మంగళవారం సాయంత్రం సీతారామ లక్ష్మణ సమేత ఆంజనేయస్వామి మూలవర్లకు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. రాత్రి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి రథంపై కొలువుదీర్చారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, చిన్నారుల కోలాట ప్రదర్శనల నడుమ రథోత్సవం కనువిందుగా సాగింది. యువకులు జైశ్రీరామ్ అంటూ రథం ముందు నినాదాలు చేశారు. రథంపై స్వామి అమ్మవారు భక్తులకు కటాక్షించారు. పెద్దసంఖ్యలో భక్తులు సీతమ్మ, రామయ్యలకు కొబ్బరికాయలు కొట్టి, కర్పూర నీరాజనాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. రథాన్ని లాగేందుకు మహిళలు, గ్రామస్తులు పోటీపడ్డారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ప్రసాద్ రెడ్డి, గ్రామస్తులు, పెద్ద సంఖ్యలో యువకులు పాల్గొన్నారు.

గ్రామీణులకు ఇంటి వద్దనే వైద్య సేవలు



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

ఐరాల: మారుమూల ప్రాంతాల్లో సైతం ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్యం అందించాలన్నదే ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం లక్ష్యమని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మండలంలోని కోనగుంటలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో వైద్యాధికారి 70 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేశారు. ప్రతి ఒక్కరికీ వైద్యం అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పఖ్వాడా కార్యక్రమంలో భాగంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందుతున్న పౌష్టికాహారంపై ఆరా తీశారు. చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అంగన్‌వాడీ కార్యకర్తకు సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ జీవకళ, హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

కనుల పండువగా విమానోత్సవం



విమానోత్సవంలో కోదండరామస్వామి

తవణంపల్లె: మండలంలోని అరగొండలో వెలసి ఉన్న శ్రీకోదండరామస్వామి దేవస్థానంలో శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం రాత్రి విమానోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం అర్చకులు ఆలయంలో మూలవిరాట్ సీతారామలక్ష్మణులకు అభిషేకం చేశారు. అనంతరం స్వామికి ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించి ధూపదీప నైవేద్యం సమర్పించి భక్తులకు స్వామి వారి తీర్థప్రసాదాలు అందజేశారు. రాత్రిలో ఉభయదారులచే విమానోత్సవాన్ని భక్తి ప్రపత్తులతో వైభవంగా నిర్వహించారు. ఉభయదారులు స్వామికి సుగంధపరిమళ పుష్పాలు, గజమాలలు, ప్రసాదాలు, పట్టువస్త్రాలను మంగళవాయిద్యాలతో ఊరేగింపుగా తీసుకొచ్చి సమర్పించారు. అర్చకులు ఉత్సవమూర్తులకు అభిషేకం, అలంకరణ, పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. పుష్పాలు, విద్యుద్దీపాలతో అలంకరించిన విమానంలో సీతాసమేతశ్రీరాముడు మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులను మైమరపించారు. భక్తులు ఇంటింటా స్వామికి కొబ్బరికాయలు కొట్టి కర్పూర, మంగళహారతులిచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయంలో 17న గురువారం ఉదయం సీతారామలక్ష్మణులకు అభిషేకం, పూజలు, రాత్రిలో మహాసుదర్శన హోమం, వసంతోత్సవం, పట్టాభిషేకం ఉంటుందని కార్యనిర్వహకులు తెలిపారు.

పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తుల ఆహ్వానం

యాదమరి: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా పండ్ల తోటల పెంపకానికి ఆసక్తి కలిగిన రైతుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఎంపీడీవో వేణు చెప్పారు. ఆయన బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో వ్యవసాయశాఖ, ఉద్యానశాఖ, ఉపాధి హామీ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 2025–26 సంవత్సరానికి గాను ఉద్యానశాఖ ఆధ్వర్యంలో పండ్లతోటల పెంపకంపై దృష్టి సారించామన్నారు. ఐదు ఎకరాల్లోపు వ్యవసాయ భూమి కలిగి అర్హత కలిగిన రైతులకు దాదాపు రెండు ఎకరాల వరకు మామిడి, దానిమ్మ, సపోటా, డ్రాగన్ ఫ్రూట్, కొబ్బరి తదితర 14 రకాల పండ్లతోటలను సాగు చేసుకోవచ్చని తెలిపారు. ఆసక్తి కలిగిన రైతులు స్థానిక ఉపాధి , వ్యవసాయశాఖ కార్యాలయాల్లో, ఉపాధి హామీ క్షేత్ర సహాయకుల వద్ద ఈ నెల 30వ తేదీ లోపల దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకుని వాణిజ్య పంటలపై దృష్టి సారించి ఆర్థికంగా బలోపేతం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏఓ చరిత, ఏపీఓ సంధ్యారాణి, రెడ్డి, ఉపాధి హామీ క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగుపై మక్కువ చూపాలి



చెర్లోపల్లెలో విత్తనాలు అందజేస్తున్న డాక్టర్ సంధ్యారాణి, ఏఓ ప్రవీణ్

తవణంపల్లె: రైతులు చిరుధాన్యాలు సాగుపై మక్కువ చూపాలని చిత్తూరు ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ సంధ్యారాణి తెలిపారు. మండలంలోని చెర్లోపల్లెలో మంగళవారం చిరుధాన్యాల సాగుపై రైతులకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త డాక్టర్ సంధ్యారాణి మాట్లాడుతూ రాగి పంటలో అధిక దిగుబడినిచ్చే కొత్తరకం విత్తనాలు వచ్చినట్లు వివరించారు. రైతులు విత్తన శుద్ధి చేయాలన్నారు. సమగ్ర యాజమాన్య పద్ధతులు, పాటించి సాగులో మెలకువలు పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చని పేర్కొన్నారు. చిరుధాన్యాల్లో ఐరన్, జింకు, విటమిన్లు ఉండడం వల్ల పోషకాహార లోపం, రక్తహీనత సమస్యలు తగ్గుతాయని అన్నారు. వ్యవసాయాధికారి జి.ప్రవీణ్ మాట్లాడుతూ జీవన ఎరువులు వాడకం, వాటి ఉపయోగాలు, జీవనశిలీంద్రనాశిని ట్రైకోడెర్మా విరిడి వాడకం వల్ల కలుగు ప్రయోజనాల గురించి వివరించారు. భూసార పరీక్షల ఫలితాల ఆధారంగా ఎరువులు వాడాలన్నారు. వ్యవసాయ యాంత్రీకరణ గురించి తెలిపారు. అనంతరం రైతులకు అధిక దిగుబడినిచ్చే రాగి కొత్త రకం విత్తనాలు, కలుపు మందు, వేపగింజల కాషాయం అభ్యుదయ రైతులకు పంపిణీ చేశారు.

కేసులు ఉపసంహరించుకోవాలి

చిత్తూరు కలెక్టరేట్: రాహుల్, సోనియాగాంధీల మీద పెట్టిన అక్రమ కేసులను ఉపసంహరించుకోవాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు భాస్కర్ మాటాడుతూ, బీజేపీ ప్రభుత్వం ఏకపక్ష నిర్ణయాలు మానుకోవాలన్నారు. బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలను ప్రోత్సాహిస్తూ పేదల పై పన్నుల రూపంలో భారం వేస్తోందన్నారు. ప్రజాస్వామ్యన్ని అపహాస్యం చేస్తోందన్నారు. నాయకులు రమేష్‌బాబు, లోకేష్ రెడ్డి, అక్బర్, పరదేశి, గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు తప్పనిసరి



సేవలందిస్తున్న వైద్యసిబ్బంది

యాదమరి: గ్రామాల్లోని గర్భిణులు విధిగా వైద్య పరీక్షలు చేయించుకోవాలని మండల వైద్యాధికారి అనిల్ కుమార్‌నాయక్ తెలిపారు. ఆయన బుధవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని వేపనపల్లిలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తామన్నారు. ప్రతి నెలా మూడో బుధవారం నాడు వేపనపల్లెకు 104 సంచార వాహనంతోపాటూ వైద్యసిబ్బంది వస్తారన్నారు. ప్రతి ఒక్క గర్భిణీ క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని చెప్పారు. గ్రామీణ వైద్యాధికారి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఈ ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బందిత పాల్గొన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం





గుడిపాల: పానాటూరులో పోషణ్ పఖ్వాడ కార్యక్రమం నిర్వహిస్తున్నఅంగన్‌వాడీ సిబ్బంది, తవణంపల్లె: అంగన్‌వాడీ కేంద్రంలో మాట్లాడుతున్న ఐరాల సీడీపీఓ నిర్మల

గుడిపాల: సంపూర్ణ ఆరోగ్యం పౌష్టికాహారంతోనే సాధ్యమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సర్ణలత అన్నారు. పానాటూరు అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పోషణ్ పఖ్వాడ పక్షోత్సవాలను నిర్వహించారు. పోషకాహార పదార్థాలతో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను వారు తిలకించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీల్లో పోషకాహారం తీసుకునేవారితో పాటు, ఇంటికి తీసుకెళ్లే వారు కూడా సక్రమంగా భుజించేలా పర్యవేక్షించాలని ఆమె ఆదేశించారు. బిడ్డ పుట్టినప్పటి నుంచి ఆరునెలల వరకు తప్పనిసరిగా తల్లి పాలు ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సర్పంచ్ మధుపల్లవి, అంగన్‌వాడీ టీచర్లు భారతి, వసుంధర, రాజేశ్వరి, శాంతి పాల్గొన్నారు.

పిల్లల పోషణపై ప్రత్యేక శ్రద్ధ

తవణంపల్లె: మండలంలోని అరగొండ, పైమాఘం అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం పోషణ్‌బీ–పడాయ్ బీ కార్యక్రమం నిర్వహించినట్లు ఐరాల సీడీపీఓ జి.నిర్మల తెలిపారు. ఆమె మాట్లాడుతూ పిల్లల పోషణపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే పౌష్టికాహారాన్ని తప్పక తినాలని సూచించారు. బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు పట్టాలని పేర్కొన్నారు. తద్వారా పిల్లల్లో వ్యాధినిరోధక శక్తి పెరుగుతోందని వివరించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే బాలామృతం పిల్లలకు ఇవ్వాలని సూచించారు. గర్భవతులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లావణ్య అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు.